
ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు
ఆదివారం 15 జూన్ 2025

బియ్యం మాయం..!

ఆదోని పట్టణ శివారున శిరుగుప్ప సర్కిల్ సమీపంలో ఉన్న ఓ గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారు. ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆకస్మికంగా దాడులు చేశారు. 1,500-1,800 (ఒక్కో బస్తా 50 కిలోలు) బస్తాలు పట్టుకున్నారు. పట్టుబడిన పేదల బియ్యాన్ని స్వాధీనం చేసుకోమని సబ్ కలెక్టర్ భరత్‌కుమార్ సహా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. తెల్లారేసరికి రేషన్ బియ్యాన్ని మాఫియా మాయం చేసింది. శనివారం ఉదయం తీరిగ్గా వెళ్లిన రెవెన్యూ అధికారులు గోదాములో 109 బస్తాలు సీజ్ చేశామని సెలవిచ్చారు. అర్ధరాత్రి గోదాములోని రేషన్ బియ్యం తెల్లారే సమయానికి ఏమయ్యాయి..? నిందితుల వెనుక ఉన్నది ఎవరు..? సివిల్ సప్లయ్ డైరెక్టరే నేరుగా రేషన్ బియ్యానికి కాపలా పెట్టమని సూచించినా పోలీసులు రక్షణ ఏర్పాటు ఎందుకు చేయలేదు? దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం.



- ఆదోని శివారులోని ఓ గోదాములో రేషన్ బియ్యం అక్రమ నిల్వ
- ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు దాడులు
- పట్టుబడిన 1,500-1,800 బస్తాలు
- రాత్రికి రాత్రే మాయం చేసిన రేషన్ మాఫియా
- ఇంతకూ నిందితులెవరు?

కర్నూలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏపీ ప్రభుత్వ ప్రజా పంపిణీ (సివిల్ సప్లయ్) విభాగం పర్యవేక్షణలో 2,437 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 12.05 లక్షల రేషన్ కార్డుదారులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రతినెల 20 వేల మెట్రిక్ రేషన్ బియ్యం ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 6.72 లక్షల రేషన్ కార్డుదారులకు ప్రతి నెల సగటున 11 వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 5.34 లక్షల రేషన్ కార్డుదారులకు 9 వేల మెట్రిక్ టన్నులు బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలనెలా రూ.వేల కోట్లు వెచ్చిస్తూ ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నాయి. ప్రతి వ్యక్తికి 5 కిలోలు చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తున్నారు. అయితే కొందరు రేషన్ బియ్యాన్ని అక్రమంగా సరిహద్దులు దాటించి ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతున్నారు. గత వైసీపీ హయాంలో ఉచిత బియ్యాన్ని అక్రమార్కులు పందికొక్కుల్లా తినేశారు. ఆదోని కేంద్రంగా జగన్ ప్రభుత్వ హయాంలో ఆనాటి వైసీపీ ముఖ్య ప్రజాప్రతినిధి తనయుడు ఆధ్వర్యంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వైసీపీ నాయకులు అధికార కూటమిలోని బీజేపీలో చేరి బియ్యం మాఫియా సాగిస్తున్నట్లు తెలుస్తున్నది.


అర్ధరాత్రి తరువాత సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు సమక్షంలో గోదాముకు తాళం వేస్తున్న వీఆర్వో రాజశేఖర్‌గౌడ్


ఆదోని పట్టణ శివారులోని గోదాంలోని రేషన్ బియ్యం బస్తాలు

దాడుల్లో బయటపడిన రేషన్ బియ్యం డంప్:

ఆదోని పట్టణ శివారున శిరుగుప్ప సర్కిల్ సమీపంలో ఓ ప్రైవేటు గోదాము అడ్డాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. సివిల్ సప్లయ్ డీలర్లు, కార్డుదారుల నుంచి కిలో రూ.9-10లకు కొనుగోలు చేసిన బియ్యాన్ని వివిధ మార్గాల ద్వారా ఆ గోదాముకు చేర్చి.. అక్కడి నుంచి రాత్రికి రాత్రే సరిహద్దులు దాటించి కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల ఒకటో తారీఖు నుంచి ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేసి.. డీలర్ల ద్వారానే కార్డుదారులకు బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. పంపిణీ చేసిన బియ్యాన్ని వివిధ మార్గాలు ద్వారా ఆదోని శివారులోని రహస్య గోదాముకు చేర్చారు. ఒక్కొక్క బస్తా 50 కిలోల చొప్పున తూకం వేసి రవాణాకు సిద్ధం చేస్తున్నారు. సమాచారం రావడంతో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు శుక్రవారం రాత్రి ఆదోనికి చేరుకున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలత దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. కల్లుబావి వీఆర్‌ఓ రాజశేఖర్‌గౌడ్, ఒకటో పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను మహేశ్‌నాయుడుతో పాటు పంపించారు. గోదాము తాళాలు తీసి చీకట్లో.. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో పరిశీలిస్తే.. గోదాం మొత్తం ఎటువైపు చూసినా తూకం వేసిన రవాణాకు సిద్ధం చేసిన రేషన్ బియ్యం బస్తాలే కనిపించాయి. దాదాపు 1,500-1,800లకు పైగా (ఒక్కో బస్తా 50 కిలోల చొప్పున 750-900 క్వింటాళ్లు) ఉంటాయని మహేశ్‌నాయుడు తెలిపారు.

మిగతా 3వ పేజీలో


తాళం వేసిన గోదాంలో మాయం కాగా మిగిలిన బియ్యం బస్తాలు ఇవే

విద్యారంగానికి ప్రాధాన్యం

- పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం
- ఉస్మానియా కళాశాలలో నూతన భవనాలు ప్రారంభం
- మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు


ఉస్మానియా కళాశాలలో భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

కర్నూలు అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి టీజీ. భరత్ అన్నారు. ఉస్మానియా డిగ్రీ కళాశాలలో రూసా నిధులతో నిర్మించిన భవనాలను శనివారం ఆయన ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉస్మానియా కళాశాలలో చదవి, కళాశాలకు మంత్రి హోదాలో రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణ పనులని కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ 1994-96 మధ్య ఎంఎస్సీ, బీఈడీ పరీక్షలు ఈ కళాశాలలోనే రాశానని తెలిపారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థి అయిన మంత్రి టీజీ భరత్ గదులు ప్రారంభ కార్యక్రమానికి రావడం ఒక అరుదైన అవకాశమన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు ఉస్మానియా కళాశాలలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అజ్రా జావేద్, ప్రిన్సిపాల్ ఎస్ఎస్ ముజ్మామిల్, రూసా ఇన్‌చార్జి ఎస్ గజనీ, ప్రొఫెసర్ మండి అన్వర్, కార్పొరేటర్ కురవ పరమేష్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న ప్రభుత్వం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలుపుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి, అధికారంలోకి రాగానే చంద్రబాబు అమలు చేశారని కొనియాడారు. తల్లికి వందనం పేరుతో ప్రతి తల్లికి సంతానంలో ఎంత మందిని చదివిస్తూ ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.13వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేసి కూటమి ప్రభుత్వం వాగ్దానం నిలుపుకున్నదని అన్నారు. వైసీపీ నాయకులు ఇది జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి రైతులపై కపట ప్రేమ నటిస్తూ పొగాకు రైతులను పరామర్శించేందుకు పొదిలికి వెళ్లి కుట్రపూరితంగా అల్లర్లు సృష్టించేందుకు చేసిన ప్రయత్నం వికటించిందని తెలిపారు. ఇందులో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కాసాని మహేష్ గౌడ్, సత్రం రామకృష్ణ, పుల్లయ్యచౌదరి, డీ.జేమ్స్ పాల్గొన్నారు.

రక్తదానం ఆరోగ్యానికి మంచిది



రాయపాటి శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్

- ప్రాణాలను కాపాడే రక్తదానం
- కలెక్టర్ పి. రంజిత్ బాషా
- రక్తదాతలకు, స్వచ్ఛంద సంస్థలకు సర్టిఫికెట్ల అందజేత
- ఘనంగా ప్రపంచ రక్తదాన దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శనివారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ఆవరణంలో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్, డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. జిల్లాలో 45వేలు యూనిట్ల రక్తం అవసరం కాగా, 35వేల యూనిట్ల రక్తం మాత్రమే రక్తదాతల నుంచి వస్తుందని, ఇంకా 10వేల యూనిట్ల రక్తం కొరత ఉందన్నారు. వచ్చే ఏడాది ఈకొరతను అధిగమించాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో రక్తదానం చేసిన విద్యాసంస్థలు, ఎన్జీవోలు, రెడ్‌క్రాస్ సభ్యులను కలెక్టర్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కే.అ రుణ, మధుసూదన్, ప్రభాకర్ రెడ్డి, భీమశంకర్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసులు, జిల్లా కోశాదికారి రఘునాథరెడ్డి, సెక్రటరీ వెంకట కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు అంబారీపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు అంబారీపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం జ్యేష్ఠ మాస తదియ శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారీలో ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహా మంగళ హారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.


బంగారు అంబారీపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

నేడు మంత్రాలయానికి కేంద్రమంత్రి ప్రహ్లాద జోషి

మంత్రాలయం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేంద్ర వినియోగదారు వ్యవహారాల శాఖ మంత్రి ఆదివారం రాత్రి మంత్రాలయంకు వస్తున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి శనివారం తెలిపారు. మంత్రాలయంలోనే బసచేసి సోమవారం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేయను న్నారు. అనంతరం మఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందనున్నారు. మంత్రి రాకకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

437 మందికి షోకాజు నోటీసులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ఈనెల 12న కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి గైర్హాజరైన 437 మంది అధికారులు, ఉద్యోగులకు కమిషనర్ ఎస్. రవీంద్ర బా బు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నెలరోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర మహోత్సవానికి కేవలం ఒక్క రోజు రావాలని ఆదేశాలు జారీ చేసినా.. డుమ్మా కొట్టిన అధికారులు, ఉద్యోగులు వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 21న జరిగే యోగాం ధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన అధికారులు, ఉద్యోగులకు తెలిపారు. గైర్హాజరైన వారిలో నగర పాలకసంస్థ పరిపాలన భవనంలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నీట్ ఫలితాలు విడుదల
ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
3

బిజినెస్ ప్లస్

కర్నూలు ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲



నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.

లవ్ యూ U నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.



వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..

ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

ఇదీ GST

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జులైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసికి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్



వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం

మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కేజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం



ఆసియా జిమ్నాస్టిక్స్

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 138 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్మాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.



ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నీట్ ఫలితాలు విడుదల

- కర్నూలు పట్టణానికి చెందిన వారిదే హవా
- ఆలిండియా స్థాయిలో గోవర్ధన్‌చౌదరికి 431వ ర్యాంకు
- ఎస్టీ కేటగిరిలో మెగావత్ అఖిల్ బాలాజీ నాయక్‌కు 27వ ర్యాంకు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మెడికల్, డెంటల్ యునాని కోర్సుల ప్రవే శాల కోసం నిర్వహించిన నీట్-యూజీ-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదల య్యాయి. కర్నూలు పట్టణానికి చెందినవారే హవా కొనసాగించారు. ఈ పరీక్ష ఫలితాల్లో కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన ఆర్.గోవర్ధన్ చౌదరి 621/720 మార్కులతో జనరల్ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 431వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 281వ ర్యాంకు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. డి.హేమ సాగరిక 595 మార్కులతో ఆలిండియా స్థాయిలో 1721వ ర్యాంకును, కేటగిరిలో 44వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. సఫా సైఫా ఖురేషీ 585 మార్కులు, జనరల్ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 22814వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 1505వ ర్యాంకు సాధించారు. అఖిల్ బాలాజీనాయక్ మెగావత్ 576 మార్కులతో ఆలిండియా స్థాయిలో 4169వ ర్యాంకును, ఎస్టీ కేటగిరిలో 27వ ర్యాంకును, ఎస్.సమిత్ 572 మార్కులతో ఆలిండియా స్థాయిలో 4970వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 2453వ ర్యాంకును, శ్రీసాయి ఫణీంద్ర దాసరి 570 మార్కులతో ఆలిండియా స్థాయిలో 5369వ ర్యాంకును, ఎస్సీ కేటగిరి విభాగంలో 126వ ర్యాంకును, జయాంశ 551 మార్కులతో ఆలిండియా స్థాయిలో 11587వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 4926వ ర్యాంకును సాధించారు. గూడూరు చెందిన చంద్రశేఖర కుమార్తె శ్రీధన్య 592 మార్కులతో ఆలిండియా స్థాయిలో 2032వ ర్యాంకు సాధించారు. కార్తీక్ మాచాని 560 మార్కులతో ఆలిండియా స్థాయిలో 8421వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 3468వ ర్యాంకు, పగిడ్యాల దీపిక 544 మార్కులతో ఆలిండియా స్థాయిలో 14962వ ర్యాంకును, ఎస్సీ కేటగిరిలో 335వ ర్యాంకును, బి.ప్రసన్నదీప్ 543 మార్కులతో ఆలిండియా స్థాయిలో 15,548వ ర్యాంకును, ఎస్సీ కేటగిరి విభాగంలో 353వ ర్యాంకును, గురు పృథ్వి 538 మార్కులతో ఆలిండియా స్థాయిలో 18657వ ర్యాంకును, ఎస్సీ కేటగిరి విభాగంలో 419వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈసారి విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో వంద లోపు ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు లేకపోవడం కొసమెరుపు.

కార్డియాలజిస్టు అవుతా



మెడిసిన్ చదివి కార్డియాలజిస్టు అవుతా. తండ్రి రామాంజనేయులు నాయక్ పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్. తల్లి సావిత్రిబాయి కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా పనిచేస్తున్నారు. నీట్ పరీక్షలో 576మార్కులు, ఆలిండియా స్థాయిలో 4169వ ర్యాంకు, ఎస్టీ కేటగిరి విభాగంలో 27వ ర్యాంకును సాధించా. జిప్‌మర్ యూనివర్సిటీలో మెడిసిన్ చేసి కార్డియాలజిస్టుగానూ, రేడియాలజిస్టుగా స్థిరపడాలన్నదే లక్ష్యం. ఈర్యాంకు రావడానికి తల్లిదండ్రులు, అధ్యాపకులు, సోదరి ప్రోత్సాహమే కారణం.

● అఖిల్ బాలాజీనాయక్ మెగావత్, కర్నూలు

డాక్టరై వైద్యసేవలు అందిస్తా



గొప్ప డాక్టర్‌నై పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నది లక్ష్యం. నారాయణ కళాశాలలో ఇంటర్ వరకు చదివా. ఇంటర్‌లో 977/1000 మార్కులు సాధించా. నీట్ పరీక్షలో 621/720 మార్కులతో ఆలిండియా స్థాయిలో 431వ ర్యాంకును, కేటగిరి వారిగా 281వ ర్యాంకు సాధించా. కర్నూలు నగరంలోనే అగ్రస్థానంలో నిలిచా. తల్లిదండ్రులు యుగంధర్ చౌదరి, తల్లి యామిని అభినందించారు.

● ఆర్.గోవర్ధన్ చౌదరి, సంతోష్‌నగర్, కర్నూలు (621 మార్కులు, 431వ ర్యాంకు)

ర్యాంకు రావడం ఆనందంగా ఉంది



డాక్టర్ కావాలన్నదే లక్ష్యం. పడిన కష్టానికి ఉత్తమ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. తండ్రి డా.బీవీ శ్రీహరిబాబు. జి.పుల్లారెడ్డి డెంటల్ కళాశాలలో ప్రొఫెసర్. తల్లి మంజుల వాణి ఎంపీడీవో, ప్రస్తుతం డీపీఆర్సీలో జిల్లా కోఆర్డినేటర్. ఇంటర్ కర్నూలు నారాయణ కళాశాలలో చదివా. ఇంటర్‌లో 937/1000 మార్కులు సాధించా.

●డి.హేమ సాగరిక, 595 మార్కులు, ఎస్సీ కేటగిరిలో 44వ ర్యాంకు

ప్రజలకు సేవ చేస్తా



కార్డియాలజిస్టు అయి ప్రజలకు సేవ చేస్తా. అమ్మ శ్యామల కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో అధ్యాపకురాలు. ఇంటర్ కర్నూలు నారాయణ కాలేజీలో చదివా. ఇంటర్ పబ్లిక్ పరీక్షలో 980/1000 మార్కులు సాధించా. దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఢిల్లీ, భూపాల్, వంటి ప్రముఖ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చేయాలన్నదే ధ్యేయం. ఉత్తమ ర్యాంకు రావడానికి అమ్మ ప్రోత్సాహంతో పాటు అధ్యాపకుల కృషి ఎంతగానో ఉంది.

● దాసరి శ్రీసాయి ఫణీంద్ర, 570 మార్కులు, ఆలిండియా స్థాయిలో 5369, ఎస్సీ కేటగిరిలో 126వ ర్యాంకు

ఎమ్మిగనూరు విద్యార్థికి 133వ ర్యాంకు

● కార్డియాలజిస్టు కావడమే లక్ష్యం: మహ్మద్ సోహెల్



తల్లిదండ్రులతో ఎస్కే మహ్మద్ సోహెల్

ఎమ్మిగనూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో ఎమ్మిగనూరుకు చెందిన విద్యార్థి ఎస్కే మహ్మద్ సోహెల్ జాతీయస్థాయిలో 640 మార్కులతో ఓసీలో 133వ ర్యాంకు సాధించి కేటగిరి విభాగంలో 94వ ర్యాంకుతో జిల్లాలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచాడు. కోడుమూరులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కమల్‌సాహెబ్, బదినేహాల్ జడ్పీఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ నసీమున్నీసా ఎమ్మిగనూరు పట్టణంలోని మునెప్పనగర్‌లో నివా సం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు బీటెక్ పూర్తి చేయగా, మరో కుమారుడు ఎస్కే మహ్మద్ సోహెల్ ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తిచేశాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఎస్కే మహ్మద్ సోహెల్ ప్రతిభ కనబరిచాడు. నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 640 మార్కులతో ఓసీ కేటగిరిలో 133వ ర్యాంకు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎస్కే మహ్మద్ సోహెల్‌ను అభినందించి మిఠాయిలు తినిపించారు. సోహెల్ మాట్లాడుతూ అమ్మానాన్నల ప్రోత్సాహంతోపాటు గురువులు సూచించిన ప్రకారం చదివి ఈ ర్యాంకును సాధించానన్నారు. కార్డియాలజిస్ట్ కావలన్నదే తన లక్ష్యమని, పేదలకు ఉచిత వైద్యం అందిస్తానన్నారు.

నీట్‌లో నంద్యాల విద్యార్థుల ప్రతిభ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. నంద్యాల ఎస్‌డీఆర్ కళాశాలకు చెందిన భువన్‌తేజ 610 మార్కులు సాధించి 221వ ర్యాంక్ సాధించాడు, పట్టణంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సంజీవకుమార్ కుమారుడైన భువనతేజ తాను డాక్టర్‌గా వైద్యసేవలు అందిస్తూ తన తండ్రి బాటలో నడుస్తానని చెబుతున్నాడు. పాణ్యం గ్రామానికి చెందిన న్యాయవాది శ్రీకాంత్ కుమా రుడు జితేంత్ర 6586వ ర్యాంక్ సాధించాడు. నంద్యాలకు చెందిన న్యాయవాది రూపేంద్ర నాథ్‌రెడ్డి కుమారుడు దీక్షిత్‌రెడ్డి 8446 ర్యాంక్ దక్కించుకున్నాడు. ఎస్‌డీఆర్ కళాశాలలో చదివి కడపకు చెందిన వ్యవసాయ రైతు పెద్దమునిరెడ్డి కుమార్తె మునిజాహ్నవి 9642 ర్యాంక్ సాధించారు. ఎస్సీ కేటగిరీలో హనోక్‌స్పుర్జన్‌రాజ్ 424 మార్కులు సాధించి 8774 ర్యాంక్ పొందాడు. న్యూక్లియస్ కళాశాలకు చెందిన ప్రదీప్ కుమార్ 753వ ర్యాంక్, ప్రియాంక 7500 ర్యాంక్, మౌనిక 9299 ర్యాంక్, సాధించారు.



221వ ర్యాంక్ సాధించిన భువన్‌తేజ



8446 ర్యాంక్ సాధించిన దీక్షిత్‌రెడ్డి



753 ర్యాంక్ సాధించిన ప్రదీప్‌కుమార్

అక్షరశ్రీ జూనియర్ కళాశాలకు...



రేచల్ విక్లీప్

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని అక్షర శ్రీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని రేచల్ వీక్లిప్ ప్రతిభ చాటింది. నీట్‌లో 564/720 మార్కులు సాధించింది. 7178 ఆల్ ఇండియా ర్యాంకు రాగా, ఓపెన్ కేటగిరిలో 3355 ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా, తల్లి సంధ్యారాణి మోటివేషన్ స్పీకర్‌గా, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారిగాపనిచేస్తున్నారు. కళాశాల యాజమాన్యం మేఘనాథ్ రెడ్డి అభినందించారు.

వక్ఫ్ చట్టాన్ని పరిరక్షించుకోకపోతే మైనార్టీల మనుగడే కష్టం

● ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ



మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత అసాదుద్దీన్ ఓవైసీ

ఆదోని అగ్రికల్చర్, జూన్14(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని పరిరక్షించుకోకపోతే మైనార్టీల మనుగడకే కష్టమని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. శనివారం రాత్రి జామియా మసీదు వెనక భాగంలోని మసూదియా పాఠశాల ఆవరణలో ఆలిండియా ముస్లీం లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టంపై బహిరంగ సభ నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కేవలం ముస్లింలపై ఉన్న శ్రద్ధ దేశ రక్షణపై లేదని ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్, కుమారస్వామి ఎందుకు మద్దతు తెలిపారో ప్రజలకు చెప్పాలన్నారు. బ్రిటీష్ కాలంనాటి వక్ఫ్ ఆస్తులు మాత్రమే ఉన్నాయని, అలాంటి చట్టాన్ని మార్చడం దుర్మార్గమన్నారు. సమావేశంలో ముస్లీం మైనార్టీ నాయకులు హజ్రత్‌మౌలానా, జాకీర్‌సాబ్, ఖలీజ్‌సైఫుల్లా రహమాన్, నిజామీజల్సాసయ్యద్, జుబేర్‌సాహెబ్, మౌలానా సయ్యద్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంస పాలన

- బాబు అధికారంలో చీకటి రోజులు
- నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు బంగారు భవిష్యత్తు ఇవ్వగా కూటమి ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని నంద్యాల వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని తన స్వగృహంలో ఆయన కూటమి ప్రభుత్వ ఏడాది వైఫల్యాలపై బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్యతో కలిసి పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ఏడాది పాలనలో చీకటి రోజులని అన్నారు. సీఎం, ఆయన తనయుడు లోకేశ్ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాం గం పేరుతో అరాచకాన్ని సృష్టించారని కాటసాని తెలిపారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఈపుస్తకం అందుబాటులో ఉంచుతామన్నారు. కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గురువు మృతి

కోడుమూరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జంగం వీరభద్రయ్యస్వామి (83) కన్నుమూశారు. వీరభద్రయ్యస్వామి చిన్నతనం నుంచే దైవభక్తిలో గడిపారు. ఎన్నో ఆలయాలు నిర్మించారు. ఆయనకు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లో శిష్యులు ఉన్నారు. కొంతకాలంగా కర్నూల్లో నివాసం ఉంటున్న స్వామీజీ శుక్రవారం రాత్రి వయోభారంతో పరమపదించారు. దీంతో ఆయన భౌతికాయాన్ని లద్దగిరి మజారా రామాపురంలోని సొంత పొలంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలిసి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల కవితమ్మ, సర్పంచ్ పట్టి హనుమంతు వేర్వేరుగా సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి శిష్యబృందం విచ్చేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా శివరాముడు



ఏవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏ పీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డీఆర్వో కార్యాలయంలో శనివారం కలెక్టరేట్ ఏవోగా శివరాముడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏపీఆర్ఎస్ఏ నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కలెక్టరేట్ అధ్యక్షులు వెంకట్‌రాజు, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, లోకేశ్, రామాంజనేయులు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బియ్యం మాయం..!

మొదటి పేజీ తరువాయి

గోదాములో అక్రమంగా నిల్వ చేసిన బస్తాలు వీడియో తీసుకొని వీఆర్ఓ రాజశేఖర్‌గౌడ్, పోలీస్ కానిస్టేబుళ్ల సమక్షంలో తాళం వేసి.. రేషన్ బియ్యం వీడియోలు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు పంపించారు.

రాత్రికి రాత్రే మాయం

శుక్రవారం అర్ధరాత్రి ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు సమక్షంలో వీఆర్‌వో రాజశేఖర్‌గౌడ్ తాళం వేసిన గోదామును శనివారం ఉదయం తెరిచారు. అక్రమంగా నిల్వ చేసిన 109 బస్తాలు రేషన్ బియ్యం సీజ్ చేశామని, 6ఏ కేసు నమోదు చేస్తామని డిప్యూటీ తహసీల్దారు బాబు వివరించారు. అర్ధరాత్రి తనిఖీల్లో 2 వేలకు పైగా బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయని డైరెక్టర్ మహేశ్‌నాయుడు సబ్ కలెక్టర్‌కు వీడియోలు పెట్టారు. తెల్లారే సమయానికి 109 బస్తాలే ఉన్నాయి. రాత్రికి రాత్రి రేషన్ బియ్యం ఎట్లా మాయమయ్యాయి? దీని వెనుక ఉన్నది ఎవరు? సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు వెళ్లిన వీఆర్ఓ వేసిన తాళం తీసి రేషన్ బియ్యం తరలించడం వెనుకు ఆంతర్యమేమిటి..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఆదోని కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాను పెంచిపోషించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. వైసీపీ నాయకులు కొందరు బీజేపీలో చేరారు. వైసీపీ నుంచి కూటమి పార్టీలో చేరిన మండల స్థాయి ప్రజాప్రతినిధి తనయుడు రేషన్ బియ్యం దందా సాగిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఆయనే ఈ భాగోతం నడిపించాడా..? దీని వెనుక మరొకరు ఉన్నారా..? రహస్య గోదాములో భారీ ఎత్తున రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయని, అక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆదోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీరాం దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు ఏర్పాటు చేయలేదు..? అనే ప్రశ్నలు తెలుత్తున్నాయి.

నాడు బేతంచర్లలో..

నంద్యాల జిల్లా బేతంచర్ల పట్టణంలో వైసీపీ హయాంలో చక్రం తిప్పిన అప్పటి ఓ కీలక మంత్రి సమీప బంధువులకు చెందిన గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు తనిఖీ చేయగా 1,200 బస్తాలు బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆ గోదాం నిర్వాహకులకు రూ.60 లక్షలు ఫైన్ వేసినట్లు తెలిసింది. ఆ తరువాత పాణ్యంలో దాడులు చేసి ఒక గోదాంలో 750 బస్తాలు, మరో గోదాంలో 217 బస్తాలు పేదల బియ్యం సీజ్ చేశారు. నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేస్తే.. వివిధ దాడుల్లో పట్టుబడి సీజ్ చేసిన దాదాపు 900 బస్తాలు బియ్యం మాయం చేసినట్లు గుర్తించారు. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామం సమీపంలో పేదల బియ్యం అక్రమ రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి 135 బస్తాలు (54 క్వింటాళ్లు) బియ్యం, తుగ్గలి మండలం రాంపల్లి సమీపంలో అక్రమ రవాణా చేస్తున్న లారీ, ఓ కారును సీజ్ చేసి 1,100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు సీజ్ చేశారు. వెలుగు చూసిన సంఘటనలు కొన్ని. నిఘా కళ్లకు గంతలు కట్టి నెలనెల వందల లారీల రేషన్ బియ్యం సరిహద్దులు దాటికి కర్ణాటకకు తరలిపోతున్నాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.



రహస్య గోదాములో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న మహేశ్‌నాయుడు, వీఆర్‌వో రాజశేఖర్‌గౌడ్

● సివిల్ సప్లయ్ మంత్రికి ఫిర్యాదు చేస్తాను



మా తనిఖీలో 50 కిలోలు చొప్పున తూకం వేసి రవాణాకు సిద్ధం చేసిన దాదాపు 1,500-1,800 బస్తాలు ఉన్నట్లు గుర్తించాం. తెల్లారక 109 బస్తాలే ఉన్నాయని డిప్యూటీ తహసీల్దారు బాబు చెప్పారు. రాత్రి వీఆర్ఓ సమక్షంలోనే సీజ్ చేశాం. దీనిపై సివిల్ సప్లయ్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహన్, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఎండీ మంజీర్ జిలానీసమూన్‌కు ఫిర్యాదు చేస్తాను.

- రమేశ్‌నాయుడు, డైరెక్టర్, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్

విచారణ చేయిస్తాం



ఆదోనిలోని ఓ గోదాంలో రహస్యంగా నిల్వ చేసిన 109 బస్తాల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు మండల అధికారుల నుంచి మాకు సమాచారం వచ్చింది. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తాం. అంతకుమంచి మాకు సమాచారం లేదు.

● రాజారఘువీర్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి, కర్నూలు

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● 394 గ్రాముల బంగారు, 326 గ్రాముల వెండి, ల్యాప్ టాప్ స్వాధీనం ● విలువ సుమారు రూ.39 లక్షలు



నిందితుల అరెస్టును చూపుతున్న నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

నంద్యాల టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నందికొట్కూరు పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు. నందికొట్కూరులోని బాలాజీ నగర్‌లో ఇటీవల దొంగతనం జరిగింది. ఈ కేసుపై నందికొట్కూరు పోలీసులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 13న నందికొట్కూరులోని ఆత్మకూరు రోడ్డులో మిర్యాలగూడకు చెందిన వేముల శంకర్, గుంటూరు జిల్లాకు చెందిన పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు కర్నూలు, నంద్యాల, గుంటూరు, తూర్పు గోదావరి, అనంతపురం, అన్నమయ్య, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన దొంగతనం కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు తేలింది. శంకర్‌పై 21 కేసులు, పవన్‌కుమార్ 36 కేసులు ఉన్నాయి. వీరి నుంచి 394 గ్రాముల బంగారు ఆభరణాలు, 326 గ్రాముల వెండి వస్తువులు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.39 లక్షలు ఉంటుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కుమార్, సిబ్బంది శ్రీనివాసులు, బాలకృష్ణ, ఓబయ్య, ఇబ్రహీం, యేసుదాస్, చంద్రశేఖర్, గంగారం, చిన్నమద్దిలేటి, మాలిక్‌బాషా, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన: టీఎన్‌టీయూసీ


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

కర్నూలు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏర్పాటై ఏడాది పూర్తయిందని, సుపరిపాలన సాగుతోందని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వై.నరసింహులు అన్నారు. శనివారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు అరుణకుమారిల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు మంచి పాలన అందించిందని కొనియాడారు. టీఎన్‌టీయూసీ నాయకులు సోమశేఖరగౌడ్, శ్రీనివాసులు, రామకృష్ణ, రమణ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ పీఠం రేసులో సుజాత?

కర్నూలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పీఠం కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ మహిళకు రిజర్వుడ్ చేయడంతో ఆ సామాజిక వర్గం నుంచి ఆశిస్తున్న వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కర్నూలు నగరం బాలాజీ నగర్ కాలనీ 40వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కె.చంద్రశేఖర్ సతీమణి కురువ సుజాత రేసులో ఉన్నారు. ఈమె స్వగ్రామం కర్నూలు రూరల్ మండలం రేమట. ఈమెను బలపరుస్తూ ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ లేఖను టీడీపీ అధిష్ఠానం సీఎం చంద్ర బాబుకు పంపించారు. అయితే.. ఇదే పీఠం కోసం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తనకు అత్యంత సన్నిహితుడైన టీడీపీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు గోల్కొండ అబ్దుల్ అమీద్ సతీమణి గోల్కొండ అజ్మత్‌బీ పేరును సిఫారస్ చేసినట్లు తెలుస్తోంది. మంత్రి టీజీ, ఎంపీ బస్తిపాటి నాగరాజు చెరో ఒకరిని ప్రతిపాదించడంతో అధిష్ఠానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో..? వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ పార్టీ సి.బెళగల్ మండల అధ్యక్షుడిగా సుంకన్న

కర్నూలు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బైరపోవు సుంకన్నను నియమించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌చార్జి అనంత రత్నం మాదిగ ఆయనకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం. ఖాద్రీ పాషా, నవీద్, సుంకన్న, జాన్ సదానందం పాల్గొన్నారు.

మద్యంతో అనారోగ్య సమస్యలు

కర్నూలు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ అన్నారు. శనివారం నగరంలోని బంగారుపేటలో ఈఎస్టీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి కేర్ కమిటీ ఆధ్వర్యంలో మద్యం తాగడంతో వచ్చే సమస్యలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. చంద్రహాస్ మాట్లాడుతూ సారా తాగడం వలన వచ్చే అనర్థాల గురించి వివరించారు. సారా తయారీ మానేసిన వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు పొందేటట్లు చేయడమే లక్ష్యంగా కేర్ కమిటీ ముందుకు వెళ్తుందన్నారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి, సురేందర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు పాలూరిలతో కలిసి లోగోను ఆవిష్కరించారు. మన్సూరుద్దీన్ మాట్లాడుతూ ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో క్రీడాభివృద్ధిలో భాగం కావడం నిర్వహకుల కృషిని ప్రశంసించారు. విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి, డా.తిరుపాల్ రెడ్డి, రామాంజనేయులు, నాగరత్నమయ్య, సుధీర్, షేక్షావలి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

డ్వామా పీడీ రమణయ్య

ఓర్వకల్లు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డ్వామా పీడీ రమణయ్య అన్నారు. యోగా మహోత్సవాల్లో భాగంగా ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ వెంకటరమణయ్య హాజరయ్యారు. పొదుపులక్ష్మి మహిళలకు, వివిధ శాఖ అధికారులతో యోగా అభ్యాసకుడు నాగరాజు ఆసనాలు చేయించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం వెంకట్రామిరెడ్డి గ్రామ పెద్దలు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏసేపు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేషన్ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. శనివారం ఆయన బుధవారపేటలోని 30వ సచివాలయ పరిధిలో యోగా దినోత్సవం కోసం సన్నాహక సామూహిక ప్రదర్శనలో పాల్గొని యోగాసనాలు వేశారు.


కోడుమూరు మండలం ఎర్రదొడ్డిలో యోగా చేస్తున్న గ్రామస్థులు



ఓర్వకల్లులో యోగా చేస్తున్న డ్వామా పీడీ రమణయ్య, అధికారులు, నాయకులు, కర్నూలులో..

చిన్నరాముడు మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ నెల 17న ఔట్ డోర్ స్టేడియంలో 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, శిక్షకులు పాల్గొన్నారు.

కల్లూరు: ప్రతిరోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని జడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నా రు. శనివారం కల్లూరు మండలం పర్ల జిల్లా పరిషత్ పాఠశాల ప్రాం గణంలో ఏర్పాటు చేసిన యోగా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెట్కూరు సీఈఓ, మండల స్పెషల్ అధికారి కె.వేణుగోపాల్, ఎంపీడీఓ జి.నాగేశాచలరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మనిషి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని ప్రత్యేకాధికారి ఉస్మాన్ అన్నారు. ఈ నెల 21న అం తర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో అభ్యాసకులు యోగా ఆసనాలు చేశారు. ఉస్మాన్ మాట్లాడుతూ యోగాతో బీపీ, షుగర్, నొప్పులు వంటి రుగ్మతలను అదుపు చేయవచ్చునని అన్నారు. మాస్టర్ ట్రైనర్స్ ఆసనాలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లబండ బాషా,మాస్టర్ ట్రైనర్ శివ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లోతోపాటు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామస్థులతో కలిసి యోగా చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 8 గంటల పనివిధానాన్ని 12 గంటల పని విధానాన్ని అమ ల్లోకి తెచ్చాని అన్నారు. అదే బాటలో టీడీపీ కూటమి ప్రభుత్వం నరేంద్ర మోదీకి తలొగ్గి ఏపీలో కూడా 8 గంటల పనివిధానాన్ని 10 గంటల విధానంగా మార్చాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, సీహెచ్.సాయిబాబా, వీరన్న, నారాయ ణస్వామి, నాగేశ్వరరావు, విజయ్, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

30 వరకు 'దర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్'

● కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీ వరకు దర్తీ అబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన ద్వారా గిరిజనులకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ బెనిఫిట్ క్యాంపుల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 లేదా అంతకంటే ఎక్కువ జనాబా కలిగి. కనీసం 50 శాతం గిరిజన నివాసితులు కలిగిన గ్రామాల్లో ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తారన్నారు. మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి, నెరవణికి, హొళగుంద మండలంలోని హొళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంపా గ్రామాల్లో పథకం అమలు చేస్తారన్నారు. ఈ గ్రామాల్లో గిరిజనులకు పక్కాగృహాలు, రోడ్లు, జల్‌జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు, క్యాస్ట్ సర్టిఫికేట్లు, పెన్షన్లు, గ్యాస్ కనెక్షన్లు, కిసాన్ క్రెడిట్ కార్డులు, ముద్ర లోన్స్, పీఎం విశ్వకర్మ తదితర అన్ని ప్రయోజనాలు అందేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి, సంబంధిత మండలాల ఎంపీడీవోలు లైన్ డిపార్టుమెంట్స్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కర్నూలు రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. శనివారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో డీవైఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో, ప్రపంచ విప్లవకారుడు చెగువేరా 97వ జయంతి సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, ప్రకాశ్, కిషన్, అంజి, సుధాకర్, విశ్వనాథ్, హరి పాల్గొన్నారు.

కమీషన్ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కమీషన్ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు మార్కెట్ కమిటీ కమీషన్ ఏజెంట్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటుగా శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం అసోసి యేషన్ భవన్‌లో జరిగిన సమావేశంలో కర్నూలు మార్కెట్ కమిటీ కమీషన్ ఏజెంట్ల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటుగా శ్రీనివాసరెడ్డిలతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులకు విక్రయించే విష యంలో ఎప్పటి నుంచో వ్యాపారుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారి నుంచి సక్రమంగా డబ్బులు కమీషన్ ఏజెంట్లకు వచ్చేలా ఇకపై కృషి చేస్తామని శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఈసమావేశంలో వైస్ ప్రెసిడెంటు జూటూరు భాస్కర్, ఇల్లూరు వెంకటేశ్, కేశవరెడ్డి, బుగ్గన రామన్న, రామచంద్రుడు, అసోసియే షన్ కార్యదర్శి కట్ట చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ గోపినాథ్ రెడ్డి, పల్లె అయ్యస్వామి, సీకే మహేష్, మురళి భీమయ్య ట్రెజరర్ ఉప్పల రమణ పాల్గొన్నారు.

రక్తదానం చేసిన సర్జరీ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నేషనల్ సర్జన్స్ డేను పురస్కరించుకుని అసోసియేషన్ ఆఫ్ సర్జన్ ఆఫ్ ఇండియా కర్నూలు సిటీ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సర్జరీ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన సర్జరీ ప్రొఫెసర్ డా.కోటి రెడ్డి, ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ సెక్రటరీ డా.రామ్మోహన్ రెడ్డితోపాటు సర్జరీ పీజీలు ఏడుగురు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. అనంతరం వీరికి సర్టిఫికెట్లను కలెక్టర్ రంజిత్‌బాషా అందజేశారు. రక్తదానం చేసిన వైద్యులు, పీజీలను అసోసియేషన్ ఆఫ్ సర్జన్ ఆఫ్ ఇండియా జాతీయ ఈసీ సభ్యులు డా.రామచంద్రనాయుడు, డా.రామ్మోహన్ రెడ్డి, కర్నూలు చాప్టర్ అధ్యక్షుడు కర్నూలు జీజీహెచ్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ డా.హరి చరణ్, ప్రొఫెసర్ డా.జే.జయరాం అభినందించారు. ఆదివారం ఐఎంఏ భవన్‌లో జరిగే నేషనల్ సర్జన్స్ డేను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఒలింపిక్ రన్‌ను జయప్రదం చేయండి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23న కర్నూలు నగరంలో ఒలింపిక్ డే రన్ జయప్రదం చేయాలి ఒలింపిక్ సంఘం చైర్మన్ కేఈ ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కేఈ ప్లాజాలో ఒలింపిక్ రన్ లోగోను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ పరుగు నగరంలోని నాలుగు ప్రాంతాల నుంచి స్టేడియం వరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సిల్వర్ జూబ్లీ కాలేజీ చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల నుంచి ర్యాలీ, రాజ్‌విహార్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి మౌర్య ఇన్ మీదుగా స్టేడియానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, విజయకుమార్, షరీఫ్ అహ్మద్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కర్నూలు జిల్లా కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి డిమాండ్ చేశారు. గత పది రోజులుగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు శనివారం ఆమె మద్దతు తెలిపారు. విజయ మనోహరి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు చాలీ చాలని జీతాలతో పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ, మల్లి, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి ఏదీ?

కర్నూలు న్యూసిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అధికారులు ఇంటి పన్నులు పెంచడంలో సమానత్వం ప్రదర్శిస్తారు.. అయితే అభివద్ధి పనులు చేపట్టడంతో అసమానతలు చూపడం ఏమిటని ఆటో నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ ఖాద్రీ ప్రశ్నించారు. శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలో స్థానికులతో కలిసి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆటోనగర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో కొందరు వారి భవనాల ముందే గుంతలు తవ్వుకున్నారన్నారు. దోమల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్న అదికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి, కరుణాకర్, రంగస్వామి, ఎండీ బషీర్, ఎస్.ఉజేర్ అహ్మద్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

డ్రైవర్ల తాత్కాలిక కమిటీ నియామకం

కర్నూలు కలెక్టరేట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం కర్నూలు జిల్లా డ్రైవర్ల తాత్కాలిక కమిటీని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, చిరంజీవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీ నియమించే వరకు తాత్కాలిక కమిటీ సభ్యులుగా షబ్బీర్ బాషా, విజయకుమార్, ఎలియాజ్ బాషా అబ్దుల్ అహ్మద్, నేమా నాయక్ నియమించారు.

నీట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో డీజీఎం గోవర్ధన్ రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చినట్లు డీజీఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆర్.గోవర్ధన చౌదరి 621 మార్కులతో ఆలిండియా స్థాయిలో 431వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 281వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే డి.హేమ సాగరిక ఆలిండియా స్థాయిలో 1721వ ర్యాంకు, కేటగిరిలో 44వ ర్యాంకును, ఖురేషీ ఆలిం డియా స్థాయిలో 2814వ ర్యాంకు, కేటగిరిలో 1505వ ర్యాంకును అఖిల్ బాలాజీ నాయక్ ఆలిండియా స్థాయిలో 4169వ ర్యాంకు, కేటగిరిలో 27వ ర్యాంకును, ఎస్.సంహిత ఆలిండియా స్థాయిలో 4970వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 2453వ ర్యాంకు, సాయి ఫణీంద్ర ఆలిండియా స్థాయిలో 5369వ ర్యాంకు, కేటగిరిలో 126వ ర్యాంకుతోపాటు ఎన్నో ఉత్తమ ర్యాంకులు వచ్చాయన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబ రిచిన విద్యార్థులను నారాయణ కళాశాలల యాజమాన్యం సన్మానిం చింది. కార్యక్రమంలో నారాయణ కళాశాలల డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్స్ ఆంజనేయ రెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ హవీలా స్మామాట్, కౌసల్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులు..


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య సిబ్బంది

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభను కనబరిచినట్లు ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. ఆలిండియా స్థాయిలో ఎన్.హరినాయక్ 2295వ ర్యాంకు, ఎం.అజయ్ 2791వ ర్యాంకు, ఎంఎం ముసాదిక్ బిలాల్-4508వ ర్యాంకు, ఎం.రవి త్రయణీ 5755వ ర్యాంకు, కే.ప్రేమ్ కుమార్ 7456వ ర్యాంకు, వై.కీర్తన 7557వ ర్యాంకు, బి.వశిష్ఠ కృష్ణన్ 8336వ ర్యాంకు, జి.సాయిదీపక్ 9084వ ర్యాంకు, జే.వంశీ 9700, ఎస్.సమీర్ 10,018వ ర్యాంకు, బి.లాస్య నందిని 10,676వ ర్యాంకు, యు.తారాచంద్ 11056, ఎం.సుస్రుత్ 18688, బి.జగదీష్ 23229, ఎం.నిజాముద్దీన్ సర్దార్ 23341, ఎస్.ఫౌజియా 27626వ ర్యాంకు, పి.ప్రవల్లిక 27785, బి.లక్ష్మికాంత్ 28973వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సహకరించిన తల్లిదండ్రులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఏజీఎం మురళీకృష్ణ అభినందించారు డీన్స్ సరళ, బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'సింధూరం' పుస్తక పరిచయ సభ

కర్నూలు కల్చరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్ల్‌మార్క్స్ కాపిటల్ గ్రంథానికి కవిత్వ రూపం, ఉన్నం వెంకటేశ్వర్లు, ఉష రాసిన 'సింధూరం' పుస్తక పరిచయ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతి నిధులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కొత్త బస్టాండు సమీపంలోని కేకే భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభాధ్యక్షుడిగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హైదరాబాదుకు చెందిన ప్రముఖ కవి బి.ప్రసాదమూర్తి, వక్తలుగా కవులు జి.వెంకటకృష్ణ, పానుగంటి చంద్ర య్య హాజరవుతారని తెలిపారు. సమన్వయ కర్తగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ వ్యవహరిస్తారని, స్రవంతి గౌర వాధ్యక్షుడు ఎంపీ బసవరాజు సభకు ఆహ్వానం పలుకుతారని వారు వివరించారు.

● **నేడు 'కవితో ఓ సాయంత్రం' కార్యక్రమం:** సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నగరం లోని టీజీవీ కళాక్షేత్రంలో కవితో ఓ సాయంత్రం కార్యక్రమం నిర్వహి స్తున్నామని కర్నూలు సాహితీ మిత్రులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కవి ప్రసాదమూర్తి పాల్గొంటారన్నారు.

నేడు డాక్టర్ సి.నారాయణ రెడ్డి వర్ధంతి సభ

కర్నూలు కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ కవి, రచయిత, జ్ఞానపీఠం పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి వర్ధంతి సభను నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియా ఒక ప్రటకనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6.30 గంట లకు జరిగే ఈ సభలో రంగస్థల నటులు, గాయకులు, రచయితలు సినారెకు శ్రద్ధాంజలి ఘటిస్తారని తెలిపారు. అనంతరం సి.నారాయణ రెడ్డి రచించిన సినీ పాటలు, గజల్స్‌పై సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వినాయక వ్రతం

కర్నూలు కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సంకట హర చతుర్థిని పురస్కరించుకొని శనివారం నగరంలోని కిడ్స్ వరల్డ్ సమీపంలో గల జిల్లా గో సంరక్షణశాలలో సామూహిక సంకట హర చతుర్థి వినాయక వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ, గాయత్రి గో సేవా సమితి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రత వేడుకల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు. వినాయక కార్యక్రమంలో గాయత్రి గో సేవా సమితి కార్యదర్శి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.




రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాతను సన్మానిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్, అడిషినల్ డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కర్నూలు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏపీ సాక్స్ ఆధ్వర్యంలో హాస్పిటల్‌లోని ధన్వంతరీ హాలులో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా సూపరింటెండెంట్ కె.వెంకటే శ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, అడిషినల్ డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం రక్తదానం చేసిన వారికి మెమెంటో, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.కిరణ్ కుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆలిహైదర్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా.రంగస్వామి పాల్గొన్నారు.

మదర్సాలపై తప్పుడు ప్రచారం తగదు


మాట్లాడుతున్న నూరి మన్సూర్ ఆలీఖాన్

కర్నూలు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదర్సా లపై కొందరు తప్పుడు ప్రచారం తగదని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు నూరి మన్సూర్ ఆలీఖాన్ పేర్కొన్నారు. శనివారం రోజా వీధిలో మదర్సా వద్ద రోజా మసీదు ప్రపోజ్డ్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో రోజా వీధిలో ఉన్న మదర్సా నిర్వహణ గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మదర్సాలు, మసీదుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రోజా విధిలోని మదర్సా ద్వారా ఆదాయం పొందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే వక్ఫ్ బోర్డు అధికారులను సంప్రందించి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. మదర్సా ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజామసీదు నిర్వహణకు ఉపయోగించాలన్న ఆలోచనలో ఉన్నామన్నారు. ప్రతినెలా రోజా మసీదు నిర్వహణకు రూ.20వేల నుంచి రూ.25వేల దాక ఖర్చువుతుం దన్నారు. కొందరు గిట్టని వ్యక్తులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈతప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని ఆయన కోరారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఆదోని , జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల వైద్యానికి భరోసానిస్తుందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. శనివారం మండలంలోని చిన్న పెండకాలు గ్రామానికి చెందిన గిడ్డయ్యకు సీఎం సహాయ నిధి చెక్కు రూ. 12లక్షల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గిడ్డయ్య గత నెల లివర్ మార్పిడి చేయించుకున్నారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సహాయం చేయడం బాధితుల ఆనందం చూశామన్నారు. బాధితులు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకి, సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లికి వందనంలో కోత విధించడం మంచిది కాదు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకంలో కూటమి ప్రభుత్వం కోత విధించడం మంచిది కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. మాట తప్పి ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి పేరుతో రూ.2వేలు కోత పెట్టడం దుర్మార్గమన్నారు. నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఉత్తేజ్, సంజయ్, సం తోష్, లోకేశ్, రాజు పాల్గొన్నారు.

రక్తదానంపై యువత అపోహలు వీడాలి



రక్తదాత చరణ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పత్తికొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై యువత అపోహలు వీడి, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని యువ స్పందన సొసైటీ అధ్యక్షుడు సురేంద్ర, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న అన్నారు. శుక్రవారం స్థానిక యువ స్పందన ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవ వేడుకలు జరిగాయి. 9సార్లు రక్తదానం చేసిన రక్తదాత అవార్డు చరణ్‌ను సత్కరించి సన్మానించారు. ఆపదలో ఉన్న వారికి చరణ్ అనేకమార్లు రక్తదానం చేసి ఎంతో మందికి ప్రాణదాతగా నిలిచారని, ప్రతి యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో యువస్పందన సభ్యులు రమేష్, మధు, వీరేష్, రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి



కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సుధాకర్‌గౌడ్

వెల్దుర్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయండి..ప్రాణదాతలు కండి అని తెలుగుయువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలులో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ రక్తదాన దినోత్సవంలో కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్ అందుకున్నారు. కేఈ.శ్యాంబాబు పత్తికొండ్ యూత్ పేరుతో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. యువతరం రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు.

నిధులు లేక పంచాయతీలు నిర్వీర్యం

● 18 నెలలుగా ఎంపీటీసీ, సర్పంచు, జడ్పీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వకపోతే ఎలా...?

● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసి అభివృద్ధి కుంటుపడేలా చేశారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం ఆలూరు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నియోజకవర్గస్థాయి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 నెలలుగా కనీసం వారికి గౌరవ వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, దీంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఏం అభివృద్ధి చేస్తున్నాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా వారికి గౌరవ వేతనాలు విడుదలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దేవనకొండ జడ్పీటీసీ కిట్టు, మండల కన్వీనర్‌లు మారయ్య, మల్లికార్జున, బసవరాజు, రాష్ట్ర నాయకులు జనార్థన్‌నాయుడు, సర్పంచ్ దేవిరెడ్డి, మండల నాయకులు రామాంజనేయులు, ఈషా, మల్లికార్జున, వీరేష్, భాస్కర్, అర్థగేరి శ్రీనివాసులు, వెంకటరెడ్డి, నాగేంద్ర, పత్తికొండ రాజు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిత్తడే..

● వంకలను తలపిస్తున్న లింగనాయునిదొడ్డి వీధులు



లింగనాయునిదొడ్డిలో వాగును తలపిస్తున్న వర్షపు నీరు

తుగ్గలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షాలకే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో దారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ప్రజలు బయటకు రావాలంటే మోకాల్లోతు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని లింగనాయునిదొడ్డిలో దాదాపు 1000 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. ఆ గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరు అంతా రోడ్లపై నిలుస్తుంది. వర్షాలు వచ్చిన సమయంలో వర్షం నీరు చేరి వాగును తలపిస్తుంది. దీంతో ప్రజలు ఏం చేయాలో తెలియక వర్షం నీరును ఎత్తిపోస్తూ గుంతలు తీసి ఒక వైపు మళ్లించి ఇళ్లలో నుంచి బయటకు వస్తున్నారు. మారుమూల గ్రామం కావడంతో మా సమస్యలు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మురుగు కాలువలతో పాటు సీసీ రోడ్లు వేయాలని ఆ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

మురుగు దాటేదేలా..?



కూనిమహల్లా వెళ్లే దారిలో వివేకానంద కాలేజి రోడ్డుపై నిలిచిన మురుగు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూనిమహల్లా కాలనీకి సమీపంలోని వివేకానంద కళాశాల ప్రధాన రహదారిపై మురుగునీరు ముందుకు పారక నిలిచిపోయింది. పారిశుధ్య కార్మికులు కాలువలు శుభ్రం చేయకపోవడంతో గత 15 రోజులుగా ప్రధాన రహదారిపైనే మురుగునీరు నిలువ ఉండడంతోతి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ దుర్వాసనను భరించలేక రోగాల బారిన పడుతున్నామని చుట్టుపక్కల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ముగునీటిలోని ఆటువైపుగా కూనిమహల్లా, ఆరణ్‌జ్యోతి నగర్, శ్రీరాంనగర్, రామ్ జల ప్రాంతాలకు ప్రజలు వెళ్తారు. పాదాచారులు, వాహనదారులు మురుగు నీటితో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మరింత బురదమయంగా మారింది. పురపాలక అధికారులు స్పం దించి మురుగు కాలువలను శుభ్రం చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.



పత్తికొండలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



తుగ్గలిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

తల్లికి వందనంతో ఆనందం

పత్తికొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కుటంబంలో చదువుకుంటున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం కింద డబ్బు అందించడంపై మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. పత్తికొండలోని గరీబ్‌నావాజ్‌కాలనీ, ముస్లిం వీధుల్లో మహిళలు తమ పిల్లలతో కలిసి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశార

తుగ్గలి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైనా తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థి తల్లికి వారి ఖాతాల్లో రూ.15వేలు నగదు జమ చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేశ్‌కు రుణపడి ఉంటామని టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి అన్నారు. శనివారం మండలంలోని రాతన, గిరిగిట్ల తదితర గ్రామాల్లో సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణమూర్తి చౌదరి, ఈరన్న, సంజీవ, సత్య ప్రకాష్, బురుజుల శ్రీనివాసులు, పూజారి దేవేంద్ర, సతీష్ చౌదరి, గిరిగిట్ల మల్లి ఉన్నారు.

పత్తికొండ టౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకంలో భాగంగా ప్రతి విద్యార్థి తల్లుల ఖాతాలకు నగదు జమ చేయడంతో తల్లులో ఆనందం వ్యక్తమవుతుందని గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, పరిపూర్ణగౌడు, బోయ రంగన్న అన్నారు. పెద్దహుల్తిలో శనివారం తల్లుల ఖాతాలోకి రూ.13వేలు జమ కావడంతో గ్రామ టీడీపీ నాయకులు, విద్యార్థులు, వారి తల్లులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బోయ రంగస్వామి, అశోక్ బోయ హుల్తన్న, గొల్ల కిష్టప్ప, నక్కల హుల్తన్న, ధర్మరాజు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోని తహసీల్దార్‌గా రమేష్



ఆదోని రూరల్, జూన్ 14 ఆంధ్రజ్యోతి) : ఆదోని ఎం.ఏ తహసీల్దార్‌గా రమేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లోభాగంగా, ఆదోని తహసీల్దార్‌గా శివరాముడు కర్నూలు కలెక్టర్ కార్యాలయ ఏఓగా బదిలీ కాగా, పత్తికొండ తహసీల్దార్‌గా ఉన్న రమేష్ ఆదోనికి బదిలీ అయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ, ఎల్లవేళలా అందుబాటులో ఉండి, రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా బాబు

ఆదోని డిప్యూటీ తహసీల్దార్‌గా బాబు బాధ్యతలు చేపట్టారు. ఆదోని డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న గుండాల నాయక్ మద్దికెరకు పత్తికొండ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న బాబుకు ఆదోనికి బదిలీ అయ్యారు. ఈయన సైతం సెలవురోజు బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

ఎస్పీని కలిసిన వైకుంఠం జ్యోతి

ఆలూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను శనివారం సాయంత్రం కర్నూలులో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆలూరు టీడీపీ మహిళా నేత వైకుంఠం జ్యోతి తెలిపారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీని అభినందించినట్లు చెప్పారు.

రైతన్న బిజీ బిజీ..

● ఖరీఫ్ ప్రారంభం...



మద్దికెర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తు వర్షాలు పడటంతో మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేసుకోగా, మొన్న కురిసిన వర్షాలకు మరి కొంత మంది రైతులు పొలాల్లో విత్తనాలు వేసుకుంటూ బిజీ బిజీ అయ్యారు. మండలంలో 11 గ్రామాలు ఉండగా.. 7,500 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో వేరుశనగ, పత్తి, కంది పంటలను అత్యధికంగా సాగు చేయడం జరుగుతుంది. ఎర్రనేలల పల్లెలయిన బసినేపల్లి, పెరవలి, మదనంతపురం, ఎం.అగ్రహారం గ్రామాల్లో పొలాల్లో విత్తనాలు వేయడం పూర్తవుతుంది. ఈ ఏడాది పదునైన వర్షాలు పడటంతో రైతులు ఆనందంతో విత్తనాలు వేసి పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు, రైతు సంఘాలు కోరుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారి రవి మాట్లాడుతూ విత్తన సమయం ఇంకా ఉందని, రైతులు తొందరపడి ఒట్టి నేలల్లో విత్తనం వేయరాదని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తా



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మద్దికెర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తహసీల్దార్ గుండాల్ నాయక్ అన్నారు. శనివారం ఆదోని నుంచి బదిలీపై వచ్చిన గుండాల్ నాయక్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలుఅందించాలన్నారు. చౌక దుకాణ డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం సాయంత్రం క్రమం తప్పకుండా చౌకదుకాణాన్ని తెరవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, వీఆర్వోలు రంగస్వామి, రషీదు, రెవెన్యూ సిబ్బంది మోదీన్ తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే చెరువుల అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న టీడీపీ ప్రభుత్వంతోనే చెరువులు అభివృద్ధి చెందుతాయనీ నీటి సంఘం అధ్యక్షులు మునిరెడ్డి, టీడీపీ నాయకులు హరినాథగౌడు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని బసినేపల్లి గ్రామంలోని లింగాలవాగు డ్యాంకు రూ.8 లక్షలు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో లింగాలవాగు డ్యాం ఎటువంటి అభివృద్ధి చెందలేదన్నారు. ఈ చెరువు కింద 300 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగమయ్య ఉన్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక కేంద్రం

మద్దికెర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఆదివారం ఆధార్ ప్రత్యేక కేంద్రం ఉంటుందని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మద్దికెర, పెరవలి గ్రామాల్లోని ఆధార్ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రంతో ఆధార్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

యోగాతో జీవనశైలి మార్పు

పత్తికొండ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతి ఒక్కరిలో జీవనశైలి మారుతుందని, అందరూ యోగాసనాలు తప్పనిసరిగా చేయాలని పత్తికొండ డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు సూచించారు. శనివారం నలకదొడ్డి గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలు, అధికారులు యోగాసనాలు చేశారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిలతో అనారోగ్యాలకు గురవుతున్నారని, దీర్ఘకాలిక వ్యాధులు, సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే యోగా తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ దివ్వేశ్వరీ, టీడీపీ నాయకులు బత్తిన రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవనకొండ: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా టూరిజం అధికారిణి విజయ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగా దినోత్సవ రిహార్సల్ చేశారు. దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేకాధికారి సమక్షంలో శనివారం చేపట్టారు. ఎంపీడీవో రమణరావు, వైద్యాధికారి విజయభాస్కర్, ఎంఈఓ యోగానంద, ఏపీఓ రాజునాయక్, యోగా మాస్టర్, ట్రైనర్లు హరి, ఐకేపీ వెలుగు ఏపీఎం నరసన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ, వీరగురుడు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చని ఎంపిడిఓ సుహాసినమ్మ అన్నారు. శనివారం వెల్దుర్తి డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థినీలతో కలిసి యోగాసనలు చేశారు. మన రోజూ వారి జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగా వలన మానసిక ప్రశాంతతోపాటు దీర్ఘకాలిక వ్యాధులు మనదరిచేర కుండా కాపాడుకోవచ్చన్నారు. అలాగే వెల్దుర్తి జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్, సచివాలయాల్లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన, ఎంఈఓ-2 రమేశ్, పంచాయతీ కార్యదర్శి గురుస్వామి, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తుగ్గలి: యోగా ప్రతి ఒక్కరి జీవితంలో దినసరి కావాలని, అప్పుడే వారి ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయనీ ఎంపీడీవో విశ్వమోహన్, తహసీల్దార్ రమాదేవి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని తుగ్గలి, ఎర్రగుడి, రాంపల్లి, జొన్నగిరి, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని మైదానాల్లో యోగా వారోత్సవాల్లో భాగంగా ఉదయాన్నే నాయకులు, అధికారులు, ప్రజలు యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల మిద్దె రవికుమార్ యాదవ్, లక్ష్మణ స్వామి, బాలన్న, సంగాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలోభాగంగా, శనివారం మండలంలోని గోనబావిలో యోగా క్లాసులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గుతుందని, ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

మద్దికెర: ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారనీ తహసీల్దార్ హుశేన్‌సాహేబ్, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని మద్దికెర, ఎం. అగ్రహారం పెరవలి, బురుజుల గ్రామాల్లో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, హరికృష్ణ, మంజునాథ్, ఉన్నారు.

ఆస్పరి: మానవాళి జీవితంలో యోగా ఒక భాగం కావాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పరామరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అలిగేర గ్రామంలో గ్రామస్థులతో కలిసి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహంతుల్లా, నాయుడు పాల్గొన్నారు.



అలిగేరలో గ్రామస్థులతో కలిసి ధ్యానం చేస్తున్న తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి



మద్దికెరలో యోగా చేస్తున్న దృశ్యం



పత్తికొండ టౌన్: నలకదొడ్డిలో యోగా చేస్తున్న ప్రజలు



వెల్దుర్తిలో యోగా చేస్తున్న విద్యార్థినులు



యోగా చేస్తున్న గోనబావి గ్రామస్థులు



జి.ఎర్రగుడిలో యోగా చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

పొద్దు తిరగడం లేదు

● నాలుగు మండలాలలో ఒక్క ఎకరం కూడా సాగు కాలేదు

● ఆసక్తి చూపని రైతన్నలు



పొద్దుతిరుగుడు పంట

గోనెగండ్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో పొద్దుతిరుగుడు పంట సాగు పూర్తిగా పడిపోయింది. ఇప్పటికి వరకు ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో ఒక్క ఎకరం కూడా పొద్దుతిరుగుడు పంటను రైతులు సాగు చేయలేదు. ఈ సీజన్‌లో రైతులు ఆ పంట సాగుపై ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతన్నలు మిరప, ఉల్లి, పత్తి పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గత నాలుగేళ్ల నుంచి పొద్దుతిరుగుడు పంట సాగు డివిజన్ పరిధిలో తగ్గిపోయింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో పొద్దుతిరుగుడు పంటను రైతులు అధికంగా సాగు చేసేవారు. అయితే గత నాలుగైదేళ్లుగా ఖరీఫ్ లో పొద్దతిరుగుడు పంట పై మక్కువ చూపటం లేదు. గత నాలుగేళ్లుగా ఈ పరస్థితి కొనసాగుతుంది. గత ఏడాది డివిజన్‌లోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలంలో కొన్ని గ్రామాల్లో 10 నుంచి 15 ఎకరాల్లోపే సాగు చేసినట్లు తెలుస్తుంది.

వైరస్ వల్లే..

పొద్దు తిరగుగు పంటకు కొన్నేళ్లుగా అంతు చిక్కని వైరస్ సోకడం ఈ కారణంగా పంట దిగుబడి పూర్తి తగ్గిపోవడం తో రైతులు ఈ పంటకు బదులు మరో పంట సాగుకు అలువాటు పడ్డారు. నెక్రోసిస్ అనే వైరస్ వల్ల, ఎక్కువగా వ్యాధులు సోకడం వల్ల గింజ నాణ్యత పడిపోయి నట్ట గింజలు రావడంతో పండిన పంటకు గిట్టుబాటు లభించకపోవడం కారణంగా పంట సాగు తగ్గిపోతుందని తెలుస్తుంది.

నూనెలో కొవ్వు శాతం ఎక్కువ

పొద్దుతిరుగుడు నూనెలో కూడా కొవ్వు ఎక్కువ శాతం ఉంటుందని తెలియడంతో ఆ నూనెను వాడటం ప్రజలు తగ్గించారు. దీంతో ఆ పంటకు డిమాండ్ తగ్గిందని తెలుస్తుంది. ఎకరం కు పెట్టుబడి రూ. 30వేల నుంచి రూ.40వేల వరకు వస్తుంది. దిగుబడి కూడా తగ్గి పోవడం మరో కారణం దిగుబడి కూడా ఎకరం కు 3 నుంచి 4 క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుంది. పండిన పంటకు క్వింటం రూ. 3500 నుంచి రూ. 4వేల వరకు పలికేది. మొత్తం రూ. 16వేల వచ్చేది. పెట్టు బడి కూడా చేతికి అందేది కాదు. ఈ కారణంగా పొద్దు తిరుగుడు పంట కారణంగా పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందేది కాదు. దీంతో రైతులు ఆ పంటను సాగు చేయడం మానుకున్నారు. దీనికి ప్రత్యామ్నాయ పంటను సాగు చేసుకోవడం మొదలు పెట్టారు. పొద్దుతిరుగుపంటను సాగు చేసుకునే రైతులు ఎక్కవ మంది మొక్కజొన్న, పత్తి పంటను సాగు చేస్తున్నారు.

వైరస్ కారణంగానే సాగు చేయడం లేదు



పొద్దు తిరుగుడు పంటకు నెక్రొసిస్ అనే వైరస్ సోకడంతో పంట దిగుబడి తగ్గిపోతోంది. పిచికారి మందుల వ్యయం ఎక్కువ అవుతోంది. ఇంత చేసినా కూడా వైరస్ అదుపులోకి రావడం లేదు. దీంతో పంట దిగుబడి తగ్గపోతోంది. పండిన పంటకు గిట్ట బాటు ధర రావడం లేదు. దీంతో రైతులు ఈ పంట సాగును మాని వేసి ప్రత్యామ్నాయం మొదలు పెట్టారు. ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు డివిజన్‌లో ఒక్క ఎకరంలో కూడా పొద్దు తిరగుడు పంట సాగు కాలేదు.

● మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ ఎమ్మిగనూరు

నిరుద్యోగ భృతి కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సహాయ కార్యదర్శి రాజీవ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంపద సృష్టించి రాష్ట్రంలో నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారన్నారు. అలాగే నిరుద్యోగ భృతిని ఇస్తామని చంద్రబాబుతోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది సంబరాలు చేసుకుంటున్నారే తప్పా నిరుద్యోగులను పట్టించుకోవడంలేదన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు ఏమి చేస్తున్నారన్నారు. గతంలో మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జూన్ 15 నుంచి జులై 15 వరకు నిరుద్యోగుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ సమావేశంలో భాస్కర్, ఇస్మాయిల్, వీరేష్, కృష్ణలు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది



కలెక్టర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు అందుకుంటున్న ఉస్మాన్

గోనెగండ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే రక్త దానం గొప్పదని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, రాష్ట్ర ఆర్ఎంపీల సంఘం నాయకులు ఉస్మాన్, కృష్ణకుమార్ అన్నారు. శనివారం ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా కర్నూలులో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరాల ద్వార ప్రజలకు సేవ చేసిన వారిని గుర్తించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేసిన గోనెగండ్ల ఉస్మాన్, కృష్ణకుమార్ ను ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ గుర్తించి శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఉస్మాన్, కృష్ణకుమార్ కు అవార్డు, ప్రశంశాపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉస్మాన్, కృష్ణకుమార్ మాట్లాడుతూ అత్యవసర పరస్థితులలో ఉన్నవారికి రక్తం కొరత లేకుండా చూడడం స్వచ్ఛంధ సేవా కార్యక్రమాల ద్వార ప్రజలకు సేవ చేసినందుకు గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఆ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

అన్ని దానాలకంటే రక్తదానం మిన్న



రక్తదానం చేస్తున్న టీడీపీ కార్యకర్త

నందవరం: అన్ని దానాల కంటే రక్తదానం ఏంతో మిన్నా అని టీడీపీ నాయకులు అల్‌ఫ్రైడ్‌రాజు, గురురాజారావు, క్లస్టర్ కాశీంవలీ, రైస్‌మిల్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం నందవరంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రక్తదాన కార్యక్రమంను దేశాయ్ నెట్‌వర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల చాల మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. టీడీపీ ఎల్లప్పుడు ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందని, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తుందన్నారు. ఈ రక్తదాన శిబిరానికి పలువురు యువతతో పాటు, పెద్దలు పాల్గొని రక్తం ఇచ్చి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో ఐ టీడీపీ తాలుకా అధ్యక్షుడు నదికైరవాడి కురవ వీరేష్, సత్యారెడ్డి, గాలెప్ప, మాబుహూసేన్, ప్రకాష్, శివ, పొతప్ప, అజయ్ పాల్గొన్నారు.

యోగా దినచర్యలో భాగం కావాలి

నందవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగ విధ్యార్థులకు దినచర్యలో ఓ భాగం కావాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. శనివారం నందవరంలోని హైస్కూల్ దగ్గర యోగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా చేసే ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కల్లుతుందన్నారు. విద్యార్థులు అందరు దిన చర్యలో భాగంగా యోగా పెట్టుకోవాలన్నారు. ఎప్పుడూ చదువు మీదే ధ్యాస కాకుండా యోగాపై కూడా మనసు పెడితే మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు

ఐటీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ మండల నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి గ్రామానికి చెందిన ఐ టీడీపీ జనరల్ సెక్రటరీ కురువ శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకులు మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు డైరెక్టర్ అబ్రహం, టీడీపీ నాయకులు కె.టి వెంకటేశ్వర్లు, జగదీష్, విశ్వనాథ్, రాముడు, వెంకటేశులు, భగవంతు లు మాట్లాడుతూ టీడీపీ ఓ మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. మృతుడి కుటుంబానికి పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందన్నారు.

బస్టాండును సుందరంగా తీర్చిదిద్దుతాం

● రూ.38 లక్షలతో మరమ్మతులు



తనిఖీ చేస్తున్న ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ నాగరాజు

మంత్రాలయం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం ఆర్టీసీ బస్టాండును సర్వసుందరంగా తీర్చిదిద్దుతామని ఏపీఎస్ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం మంత్రాలయం ఆర్టీసీ బస్టాండును కర్నూలు రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు, సీఎంఈ హరినాథ్‌బాబు, ఈఈ వెంకటాచలం, డీఈ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మంత్రాలయంలో బస్టాండులో వ్యక్తిగత మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తాగునీరు, కుర్చీలు, ప్రయాణీకులకు ఫ్యాన్లు, ప్లాట్‌ఫారాలు, రోడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం బస్టాండును సర్వ సుందరంగా తీర్చిదిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయనీ, దాదాపు రూ.38 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు, రంగులు వేయడం, కుర్చీలు ఏర్పాటు చేయడం మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

యోగాంధ్రలో భాగంగా రిహార్సల్స్

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జూన్ 21వ తేదిన జరిగే యోగాంధ్ర కార్యక్రమం కోసం మున్సిపల్ కమిషనర్ గంగిరెడి, తహసీల్దార్ శేషాఫణి పట్టణ ప్రభుత్వ బాలుర పాఠశాల గ్రౌండ్‌లో యోగాంధ్ర రిహార్సల్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాచాని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల బాలికలు ,హెడ్ మాస్టర్ కృష్ణయ్య,పీఈడి నాగేశ్వరి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషాఫణిలు మాట్లాడుతూ జూన్21వ తేదిన యోగాంధ్ర కార్యక్రమం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నందున ప్రభుత్వ బాలికల పాఠశాల వారితో యోగా రిహార్సల్ కార్యక్రమం చెపట్టడం జరిగిందన్నారు.

శ్రీమఠంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న రాఘవేంద్ర స్వామి మఠం

మంత్రాలయం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖపుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం మార్మోగింది. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహాలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎటూ తేలని.. చెట్నహాల్లి శ్మశాన వివాదం



బీసీ వర్గాలకు నచ్చజెబుతున్న జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

మంత్రాలయం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో శ్మశాన లొల్లి ఎటూ తేలలేదు. గత నాలుగు నెలలుగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాస్తారోకలు, ధర్నాలు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ ఉండటంతో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు శుక్రవారం రాత్రి చర్చలు జరిపి, శనివారం ఉదయం నుంచి ఇరువర్గాలు రానీయకుండా కంచెను ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు నిర్వహించారు. జగనన్న కాలనీలోఓ వర్గానికి ఇచ్చిన స్థలంలో కంచెను ఏర్పాటు చేసిన తర్వాత శ్మశానం వైపు దాదాపు 50 అడుగుల దూరంలో కంచె పాతేందుకు యత్నిస్తుంగా. మరో వర్గానికి చెందిన మహిళలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, అధికారులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. అనంతరం సాయంత్రం జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య ఇరువర్గాలతో చర్చలు జరిపారు. అయినా ఇరువర్గాల మధ్య రాజీ కుదరకపోవడంతో చట్టం తన పని తాను చేసుకుంటు వెళ్తుందని నిత్యం శ్మశానంపై ధర్నాలు, రాస్తారోకలు చేస్తే సరిపోదని, హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ఘర్షణలు జరిగితే ఉపేక్షించవద్దని, ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశాలు ఇచ్చి జాయింట్ కలెక్టర్ వెళ్లిపోయారు.

తల్లికి వందనం వరం లాంటిది



చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి

నందవరం, జూన్ 14(ఆంధజ్యోతి): సీఎం చంద్రబాబు చేపట్టిన తల్లికి వందనం పథకం విద్యార్థులకు వరంలాంటిదని మాజీ జెడ్పీవైస్ చైర్ పర్సన్ పుష్పావతి అన్నారు. శనివారం నందవరంలో విద్యార్థులు, వారి తల్లులతో కలసి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వంహించారు. మాజీ సి యం జగన్ ఇంటికి ఒక్కరి మాత్రం ఈ నగదు ఇస్తే, చంద్రబాబు ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి 5 మంది వరకు ఈ పథకం కింద లబ్ది పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళ్లలో ఇన్నేళ్లకు ఆనందం చూశామన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రకటనలను ప్రజలు నమ్మరన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు జంబు నాగరాజుగౌడు, మైనార్టీ నాయకులు మస్తాన్, రహీమాన్, వడ్డే గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి



చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చేగువేరా 97వ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ అధ్వర్యంలో చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా శనివారం స్థానిక తేరుబజారులో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు సురేష్, డీ వైఎఫ్ఐ నాయకులు గోవిందు మాట్లాడుతూ 1928 జూన్14న అర్జెంటీనాలో జన్మించి, యువ వైద్య విద్యార్థిగా చేగువేరా దక్షిణ అమెరికా అంతటా పర్యటించి, పేదరికం ,అన్యాయాలను చూసి చలించిపోయారని అన్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించి విప్లవకారుడిగా మారారని తెలిపారు. యువతి యువకులు చేగువేరాను స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్, మణికంఠ, వీరేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలి

గోనెగండ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైసీపీ కార్యకర్తలు నిరంతరం పాటు పడి, పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక అన్నారు. శనివారం గోనెగండ్లలో నూతనం ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం వైసీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

గురుకులానికి విద్యార్థినుల ఎంపిక

కౌతాళం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మదిరె ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ వండల పరిధిలోని మదిరె ప్రాథమికోన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న అఖిల, అఖిలశ్రీ ఇటీవల గురుకుల పాఠశాల పరీక్షలు రాశారు. అందులో ప్రతిభ కనబరిచిన ఈ ఇద్దరు ఆదోని మండలం ఆరేకల్ బాలికల గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు తెలిపారు.

యువకుల రక్తదానం



యువకుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్యులు

ఎమ్మిగనూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురష్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన రక్తదానశిబిరంలో యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన 20మంది యువకులు స్వచ్ఛందగా రక్తదానం చేశారు. వీరికి స్థానిక వైద్యులు చిరంజీవి ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డా భార్గవి, వైద్యులు చిరంజీవి, డా శ్రీచరణ్, డా మల్లికార్జున, డా వెంకటేశ్వర్లు, టెక్నీషియన్లు దొరబాబు, మదు, అశోక్, సురేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

గోనెగండ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నాడని టీడీపీ మండల నాయకులు నజీర్, తిరుపతయ్యనాయుడు, రమేష్ నాయుడు, రంగస్వామినాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో విద్యార్థులు తల్లులు, టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు నాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతూ ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం ద్వారా రూ. 13వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం పిల్లల తల్లుల అకౌంట్‌లోకి రూ. 13వేలు జమ చేసి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రంగముని, శ్రీధర్, చిన్ననేలటూరు నాగన్న, సత్య, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

'నీట్'లో విద్యార్థిని ప్రతిభ

ఎమ్మిగనూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కురువ మద్దిలేటి, మంజుల కుమార్తె కురువ రీతు అక్షయ నీట్‌లో అత్యుత్తమ ప్రతిభకనబరచి జాతీయ స్థాయిలో 8938 ర్యాంకును సాధించింది. రీతు అక్షయ 1వ తరగతినుంచి 8వ తరగతి వరకు ఎమ్మిగనూరు పట్టణంలోని నారాయణ స్కూల్‌లోను, 9,10వ తరగతులు కర్నూలులోని నారాయణ హైస్కూల్‌లో, ఇంటర్ విజయవాడలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివింది. ఇటీవల జరిగిన నీట్ పరీక్షకు హాజరైన రీతు అక్షయ మంచి మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 8938 ర్యాంకును సొంతం చేసుకోవటంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మంచి ర్యాంకు సాధించిన అక్షయకు మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు.

అంజనేయ స్వామికి పూజలు

కౌతాళం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ అంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా బుడుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె అంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక ఫలపుష్పాలతో ప్రత్యేక అలంకర ణ చేపట్టి పూజలు చేపట్టారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బుడుములదొడ్డిలో భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.